క్లుప్తంగా

వైద్యసేవలపై కేంద్ర బృందం ఆరా


పీహెచ్‌సీలో సేవలపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం

పెదపాడు : జాతీయ ఆరోగ్య పథకాల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర వైద్య బృందం సోమ, మంగళవారాల్లో పర్యటించారు. బృందం సభ్యులు అఫ్రీన్, వసంత్‌లు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు అవుతున్న టీబీ, లెప్రసీ, వైరల్ జ్వరాలు, రాబిస్ కంట్రోల్, 102, 108 సర్వీసెస్, టుబాకో కంట్రోల్, బయో మెడికల్ ఎక్విప్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, జాతీయ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్స్, కాయకల్ప, రాష్ట్రీయ, కిశోర్ స్వస్థ్య వంటి కార్యక్రమాలతో పాటు హెల్త్ సెంటర్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపి గ్రేడులు నిర్ణయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు చక్రధర్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి వన్నె తీసుకురావాలి


ఎంపీడీఓ శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

దెందులూరు: ఉపాధి పథకానికి అధికారులు, సిబ్బంది వన్నె తీసుకురావాలని ఎంపీడీఓ కె.శ్రీదేవి అన్నారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆమెను జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ దశరధి రాంజీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మంగళవారం కలిశారు. అనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ శివారు ప్రాంతంలోనూ జాతీయ ఉపాధి హామీ పథకంపై ఫిర్యాదులు రాకుండా అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. కూలీలకు నిబంధనల ప్రకారం పనులు కల్పించాలని సూచించారు. తొలుత ఉపాధి సిబ్బంది ఎంపీడీఓకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు.

పోలసానిపల్లిలో నాగేంద్ర ప్రసాద్ హౌస్ అరెస్ట్


పోలసానిపల్లిలో నాగేంద్ర ప్రసాద్‌ను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

భీమడోలు: కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీ చించివేసి అవమానపర్చిన నేపథ్యంలో మంగళవారం మాలజాతి యోధుల పోరాట సంఘం జేఏసీ ఇచ్చిన చలో ఏలూరుపాడు పోలీస్ స్టేషన్ ముట్టడి కార్యక్రమానికి నాయకులు వెళ్లనివ్వకుండా పోలీసులు కట్టడి చేశారు. పోలసానిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు అంబటి నాగేంద్రప్రసాద్ ఉదయాన్నే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పలవురికి ఫోన్ చేసి వెళ్లవద్దని పోలీసులు సూచించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఆందోళన చేసేందుకు వెళ్లే వారిని అడ్డుకోవడం సబబుకాదని నాగేంద్రప్రసాద్ అన్నారు. రఘురామకృష్ణరాజు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్న పదవిలో ఉండి అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని, అయనపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. అధ్యక్షతన నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యుత్ శాఖపై నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం మంగళశారం నిర్వహించారు. సూర్య ఘర్ యోజన కార్యక్రమంలో భాగంగా సోలార్ వినియోగాన్ని ప్రోత్సాహించాలని కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను నియోజకవర్గంలో అమలు చేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పెదపాడు : గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తహసీల్దార్ కె.సునీత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని అదేశించారు. వీఆర్వోల సంఘం నాయకులు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురుచూపు

- ఏటా రూ.20 వేల సాయం హామీ ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- పథకాలను అమలు చేయాలని కోరుతున్న రైతులు


దెందులూరులో ఏపుగా పెరిగిన వరి చేను

దెందులూరు: ఎన్నికల ముందు రైతులకు పెట్టుబడి సాయం ఏటా రూ.20 అందిస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఆ ఊసే ఎత్తడంలేదు. అన్నదాత సుఖీభవ రూ.20 వేల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. పంట బీమా పరిహారం సైతం రైతులకు అందలేదు. దెందులూరు నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుందన్నారు. కరువు కారణంగా పంటలు పండినా గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రకృతి విపత్తు, మార్కెట్ ఒడిదుడుకులు మధ్య వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పులు పాలవుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రైతుకు రూ.2.50 లక్షల అప్పులున్నాయి. సగటు రైతు కుటుంబం అప్పల నుంచి బయటకు రాలేకపోతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నా వడ్డీ, పావలా వడ్డీ కూడా పూర్తిగా ఆదుకోలేకపోతుంది. గతంలో నారా లోకేష్ వ్యవసాయ మీటర్లు ఉన్న మోటార్లను పగులకొట్టమని పిలుపునిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలుల గడిచిపోయింది. జీఓ 22ను రద్దు చేయాలని, 2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం ఇవ్వాలని, ప్రభుత్వ సాయం అన్నదాత సుఖీభవ, పంట బీమా పథకం అమలు చేయాలని కోరుతున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల ముందు రైతులకిచ్చిన హామీని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలి. రైతులకు వెన్నుదన్నుగా నిలబడాలి. కౌలు రైతుల గుర్తింపు కార్డులు వాస్తవ సాగుదారులు కాకుండా బీనామీలు అనర్హులకు ఇస్తున్నారు. వాస్తవ సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
– కె.శ్రీనివాస్, ఏపీ రైతు సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి

మోసం చేయడమే చంద్రబాబు విధానం



ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి పదవి పొందాక ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. పంటల బీమాపథకం అన్నదాత సుఖీభవ సాయం ఇవ్వకపోతే రైతాంగం ఎలా సాగు చేస్తారు. ఇదేనా రైతును ఉద్ధరించేది. రైతులతో పాటు ఎవరూ చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు. మరోసారి అందరూ మోసపోయారు.
– పర్వతనేని నరేంద్ర, రైతు, మలకచర్ల

మోసపూరిత హామీలు



ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అమలు కాని హామీలిచ్చారు. రైతులను సైతం దగా చేశారు. ప్రజలందరూ ఆకర్షితులయ్యేలా సూపర్ సిక్స్‌తో పాటు అనేక వాగ్దానాలు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా సూపర్ సిక్స్ అమలు లేదు. రైతులకు సాయం అందలేదు.
– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్ సీపీ నాయకులు, పోతునూరు

రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలి. వివక్షతకు తావులేకుండా రైతు పథకాలు అన్నింటినీ అంకితభావంతో ప్రతి రైతుకూ అందేలా అమలు చేయాలి. రైతులందరూ శపించే పరిస్థితి ప్రభుత్వం తెచ్చుకోకూడదు. అందిరికీ న్యాయం చేయాలి
– కొలుసు గణపతిరావు, కోఆపరేటివ్ సొసైటీ మాజీ ప్రెసిడెంట్

ప్రజలకు అందుబాటులో ఉండాలి


వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

పెదపాడు : గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తహసీల్దార్ కె.సునీత అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని అదేశించారు. వీఆర్వోల సంఘం నాయకులు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, బెవర కోటేశ్వరరావు, ప్రభాకరరావు, నటరాజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

కాగుపాడులో అభివృద్ధి పనుల ప్రారంభం

ఉంగుటూరు: గ్రామాల అభివృద్ధికి ఎన్‌డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం కాగుపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రూ.30 లక్షలతో నిర్మించి వాటర్ ట్యాంకు ప్రారంభించారు. కడియాల రవిశంకర్ ఏర్పాటుచేసిన రీమోడలింగ్ యూనిటును, అంబేడ్కర్ షెడ్డును ధర్మరాజు ప్రారంభించారు. సర్పంచ్ కడియాల సుదీష్ణ, మాజీ సర్పంచి కడియాల రవిశంకర్, యిమ్మని గంగాధరరావు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గమ్మ దర్శనం


పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానీ


గుండుగొలనులో గౌరీదేవిగా గాజులతో..


ఉంగుటూరు చల్లాలమ్మ


చినరామచంద్రపురం ధనలక్ష్మీదేవి


గణపవరం కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్లు


దెందులూరు సీతంపేట కనకదుర్గమ్మ


దెందులూరు శ్రీరామవరం కనకదుర్గమ్మ


దెందులూరు కనకదుర్గమ్మ

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం భక్తులకు వివిధ రూపాలల్లో దర్శనమిచ్చారు. విశేష పూజలు అందుకున్నారు. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గౌరీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. 20 వేల గాజులతో అమ్మవారికి అలంకరణచేశారు. పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానమ్మ తల్లిని భక్తులకు చెందిన రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

కాత్యాయని అవతారంలో చల్లాలమ్మ

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ వారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమించ్చారు. ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన చేశారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తదితరులు అమ్మవార్ని దర్శించుకున్నారు.

మహాలక్ష్మిగా దుర్గమ్మ దర్శనం

దెందులూరు: స్థానిక దుర్గమ్మ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. సీతంపేట మెయిన్ సెంటర్‌లో కనకదుర్గమ్మవారికి రూ.లక్షా 25 వేలతో అలంకరణ చేశారు. గోపన్నపాలెంలో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. శ్రీరామవరంలో కనకదుర్గమ్మకు భవానీలు పూజలు చేశారు.

గణపవరంలో..

గణపవరం: స్థానిక ప్రసిద్ధ కంచికామాక్షి కనకదుర్గ వార్ల ఆలయంలో అమ్మవార్లను ప్రత్యేక అలకంరణ చేసి పూజించారు. చినరామచంద్రపురంలోని కనకదుర్గమ్మ ధనలక్షిదేవిగా దర్శనమిచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా వర్మ

దెందులూరు: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా చింతమనేని వర్మ విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఏఈగా పనిచేసిన రాజేంద్ర ద్వారకాతిరుమల బదిలీపై వెళ్లారు. దెందులూరు మండలం వ్యవసాయ శాఖ ఇన్‌చార్జిగా దామా వెంకటేశ్వరరావు విధుల్లో చేరారు. అయన కొవ్వలి అగ్రికల్చర్ ఫార్మ్ నుంచి బదిలీపై వచ్చారు.

వైద్యసేవలపై ఆరా

పెదపాడు : జాతీయ ఆరోగ్య పథకాల పనితీరును పరిశీలించేందుకు కేంద్ర వైద్య బృందం సోమ, మంగళవారాల్లో పర్యటించారు. బృందం సభ్యులు అఫ్రీన్, వసంత్‌లు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు అవుతున్న టీబీ, లెప్రసీ, వైరల్ జ్వరాలు, రాబిస్ కంట్రోల్, 102, 108 సర్వీసెస్, టుబాకో కంట్రోల్, బయో మెడికల్ ఎక్విప్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్, జాతీయ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్స్, కాయకల్ప, రాష్ట్రీయ, కిశోర్ స్వస్థ్య వంటి కార్యక్రమాలతో పాటు హెల్త్ సెంటర్స్ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నా రు. ఈ నివేదికలను ఉన్నతాధికారులకు పంపి గ్రేడులు నిర్ణయిస్తామని వైద్యులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో ఎండు తెగులు ఉధృతి నివారణ


పూళ్లలో చేనులో ఎండు తెగులు సోకిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్, ఏడీఏ శైలజ, ఏఓ ఉషారాణి, రైతులు

భీమడోలు: ఎండు తెగులు ఉధృతి నివారణకు వ్యవసాయ శాఖ సూచించే యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్ అన్నారు. గుండుగొలను–2, పూళ్ల–2 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు వ్యవసాయశాఖ కార్యాలయపు ఏడీఏ శైలజ, సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్‌లతో కూడిన వ్యవసాయాధికారుల బృందం పంట చేలను సందర్శించింది. వాతావరణ పరిస్థితుల్లో నెలకొన్న అసమానతల నేపథ్యంలో ఎక్కువగా ఎండు తెగులు సోకడాన్ని గుర్తించి, తెగులు నివారణకు రైతులకు పలు సూచనలందించారు. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ఉధృతిని తగ్గించేందుకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములను ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరం పొలానికి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ సార్వా సీజన్‌లోని ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేస్తామని, రైతులకు అందుబాటులో ఉండే రైస్ మిల్లులకు ధాన్యాన్ని అమ్మేలా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు చేపట్టారని చెప్పారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన పథకాలు, వాటి వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ, వెటర్నరీ, రెవెన్యూ, కోఆపరేటివ్ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జీవామృతం

పెదపాడు : రైతులు తెగుళ్ల నివారణకు జీవామృతం తయారు చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ పి.లలిత సుధ తెలిపారు. పెదపాడు మండలం వసంతవాడ, గోగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం వాతావరణం దృష్ట్యా వరిలో పురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని వారు సూచించారు. వరిసాగులో పాటించాల్సిన చర్యలను వివరించారు. తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉందని, తగిన సమయంలో సరైన నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బెయిలీ వంతెన నిర్వహణపై నిర్లక్ష్యం


గుండుగొలను వద్ద శిథిలావస్థకు చేరిన బెయిలీ వంతెన

భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై ఉన్న బెయిలీ వంతెన పై రాకపోకలు ఆందోళన గురి చేస్తుంది. రెండేళ్ల కితం నిర్మించిన ఈ వంతెన నిర్వహణకు సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు పైసా కూడా కేటాయించకపోవడంతో వంతెన అధ్వానంగా మారింది. వంతెనపై ఉన్న రేకుల మధ్య ఉన్న నట్లు ఊడిపోవడంతో రేకులు పైకి లేస్తున్నాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న భయం గ్రామస్తులను వెంటాడుతోంది. ఈ వంతెనపై సైకిళ్లలతో వెళ్లే బాలబాలికలు, రైతులు, మోటార్ సైకిలిస్టులు ఆందోళన చెందుతున్నారు. నట్టు ఊడిపోయి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఈ వంతెనపై నుంచి భీమ డోలు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన నిర్వహణపై నీలినీడలు అలుముకోవడంతో వేలాది మంది రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. కనీసం వంతెన మరమ్మతులకు నిధులు కేటాయించాలని, భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని భీమడోలు ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు లిఖిత పూర్వక వినతిపత్రం అందించారు. వంతెన నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ఒక్క పైసా కూడా వంతెన మరమ్మతుల కోసం సంబంధిత అధికారులు నిధులు ఇవ్వలేదని, దీంతో వంతెన అస్తవ్యస్తంగా మారింది ఆయన పేర్కొన్నారు. వంతెన నిర్వహణకు సంబంధిత అధికారులు నుంచి నిధులు కేటాయించేలా తన వంతు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ధర్మరాజు హామీ ఇచ్చారని భాస్కర్ తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మావతిదేవి

గణపవరం: గ్రామ పంచాయతీ సభ్యులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. మంగళవారం గణపవరం మండల సమావేశ మందిరంలో మండలంలోని పంచాయతీ ఉపసర్పంచ్‌లు, సభ్యుల రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. రాము మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం నిర్వహణపై సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాభివృద్ధిలో దాతల సహకారం కోరాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో సురక్షిత మంచినీరు అందించాలన్నారు. తడిపొడి చెత్తసేకరణ ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎంపీడీఓ శ్రీలక్ష్మి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు వివిధ పద్దుల ద్వారా వచ్చే నిధుల వివరాలను వివరించారు. పంచాయతీ సభ్యుల హక్కులు, బాధ్యతలను వివరించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు సలాది రత్నకుమారి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలి

భీమడోలు: గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రజాప్రతినిధులు పాత్ర కీలకమని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ 2024 – 25పై రెండు రోజుల పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు టి.ముత్తయ్య, వెంకట్రావు తదితరులు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు, సమావేశాలు, ఏజెండా తీర్మానాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. తొలుత జరిగిన కార్యక్రమానికి ఈవోఆర్‌డీ ఎ.సుందరి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి పాల్గొని మాట్లాడారు. బాపూజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్య స్థాపనలో ప్రజాప్రతినిధులు తమ వంతు పాత్రను పోషించాలన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాలను సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచులు, పంచాయతీ గ్రామకార్యదర్శులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల బలోపేతానికి దోహదం

ఉంగుటూరు: స్థానిక సంస్థల బలోపేతానికి శిక్షణ దోహదపడుతుందని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఉంగుటూరులో రెండురోజుల ఉపసర్పంచులు, వార్డు సభ్యులు శిక్షనా సమావేశాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీడీఓ రాజ్ మనోజ్ మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఏఓ మనోరంజన్‌లు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ

దెందులూరు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపీడీఓ కె.శ్రీదేవి అన్నారు. మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.కిషోర్ శిక్షణ ఇచ్చారు.